ఇచ్చిన హామీలు అమలుచేశాం

- మాజీ ఎంపీ వేణుగోపాలాచారి
- నగరంలో కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేశామని ప్రజాపాలన విజయోత్సవ అబ్జర్వర్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి అన్నారు. నగరంలోని 9వ డివిజన్‌లోని చంద్రబాబు నగర్ కాలనీలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి హాజరయ్యారు. ఈసందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో కేసీఆర్ కోట్లాది రూపాయలు అప్పులు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు కడుతూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి గెలిపించినందుకు రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని సూచించారు. బీజేపీ రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. నగర అధ్యక్షుడు కేశ వేణు మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలకు కాంగ్రెస్ హయాంలోనే ఇళ్లు మంజూరుచేస్తామన్నారు. పేదలకు అవసరమైన అన్ని పథకాలు కాంగ్రెస్ అమలు చేస్తున్నదన్నారు. నాయకులు జావేద్ అక్రం, రత్నాకర్, ఆరూస్‌ఖాన్, ఖుద్దుస్, నరేందర్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులు





నగరంలోని పబ్లిక్ టాయ్‌లెట్ల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

నిజామాబాద్ సిటీ: నగరంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. పబ్లిక్ టాయ్‌లెట్లను శుభ్రం చేశారు. పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు. పనులను అధికారులు, జవాన్లు పరిశీలించారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

నిజామాబాద్ అర్బన్: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 10న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిల్ కుమార్, మహిపాల్, నజీర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

తెయూలో వైఫై సమస్య తీర్చాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో గత కొన్ని నెలలుగా ఉన్న వైఫై సమస్యను వెంటనే తీర్చాలని గిరిజన శక్తి వర్సిటీ అధ్యక్షుడు శ్రీనునాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు వైఫై లేకపోవడంతో ఆన్‌లైన్ తరగతులు వినలేకపోతున్నారని పేర్కొన్నారు. వైఫైతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై వీసీ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైన నిర్లక్ష్యం వీడి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

డిచ్‌పల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలో పోలీసులు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు పలువురు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడారు. సీఐ మల్లేష్, ఎస్సై షరీఫ్‌లు మాట్లాడుతూ.. మద్యం సేవించి ఎవరైన వాహనం నడిపితే వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రిటైర్డ్ గుమాస్తాల సమావేశం



నిజామాబాద్ నాగారం: నగరంలోని కేర్ డిగ్రీకళాశాల ఆవరణలో ఆదివారం నిజామాబాద్ బట్టల దుకాణాల రిటైర్డ్ గుమాస్తాల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జాడే సంతోష్ మాట్లాడుతూ.. పలు అంశాలపై చర్చించారు. సంఘంలోని చాలా మంది సభ్యులు సొంత ఇల్లు లేని వారు ఉన్నారన్నారు. వారికి ఇంటి స్థలాల కోసం ప్రజాప్రతినిధులతో మాట్లాడుదామన్నారు. సంఘ సభ్యులు ఎంజాల రాజు, నేలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డేను జయప్రదం చేయాలి



నిజామాబాద్ నాగారం: నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 17న తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ పెన్షనర్స్ డే జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు కోరారు. నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. పెన్షనర్స్ డే సందర్భంగా రెండు రోజులపాటు ఆటల పోటీలను రిటైర్డ్ ఉద్యోగులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాం



నిజామాబాద్ నాగారం: ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పోకల నాగయ్య అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల మద్దతుతో బరిలో నిలుస్తున్నానని తప్పకుండా అందరూ ఆదరించాలని కోరారు. టీపీటీఎఫ్ ప్రతినిధులు ఆవుల రాజేష్‌యాదవ్, సత్యనారాయణ రాజు, గజానంద్, నవీన్, శ్రీకాంత్, మురళి, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరికొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బంజారా భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు బాల్‌రాజ్ నాయక్, సంతోష్‌నాయక్, భూపతినాయక్, చందర్‌నాయక్, మాన్‌సింగ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ(మేల్) పోస్టులను భర్తీ చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీహెచ్‌ఏ అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్ నాగారం: వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఎంపీహెచ్‌ఏ) పురుష పోస్టులను భర్తీ చేయాలని ఎంపీహెచ్‌ఏ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఆదివారం జిల్లాకు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంపీహెచ్‌ఏ (పురుష) కోర్సును పూర్తి చేసుకుని చాలా సంవత్సరాలుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేసిన ఎన్నో నోటిఫికేషన్లలో తమకు అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఇటీవల వేసిన నోటిఫికేషన్‌లో సైతం తమకు సంబంధించిన పోస్టులను ప్రతిపాదించకుండా అన్యాయం చేశారని, న్యాయం చేయాలని కోరారు. నాయకులు ప్రశాంత్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ గురుకుల బాట సందర్శన కమిటీ జిల్లా ఇన్‌చార్జి సాయితేజ అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రస్తుతం అధ్వాన పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో తరచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలు వెలుగుచూడటంతోపాటు విద్యార్థులు మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ప్రతి గురుకులంలో పరిస్థితిని సమీక్షించామని పేర్కొన్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించామన్నారు. ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు .

అధ్వానంగా గ్రామీణ రోడ్లు



తొర్లికొండ రహదారిపై తేలిన కంకర

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

జక్రాన్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై కంకర తేలడంతోపాటు గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని పడకల్ నుంచి మనోహరాబాద్ మీదుగా తొర్లికొండకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. జక్రాన్‌పల్లి నుంచి నల్లగుట్ట తండాకు వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలు ఏర్పడడంతో ప్రయాణించడానికి ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. పడకల్ నుంచి తొర్లికొండ వరకు ఏడు కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్డు ఉంది. ఈ రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మనోహరాబాద్ నుంచి కొలిప్యాక్ మీదుగా జాన్కంపేట్ ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడ పాడుబడ్డ వ్యవసాయ బావులు ఉన్నాయి. అలాగే ఎక్కువగా మూలమలుపులు ఉండడంతో ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన నల్లగుట్ట తండా రోడ్డు



దెబ్బతిన్న మనోహరాబాద్ రోడ్డు

మరమ్మతులు చేయించాలి..

మనోహరాబాద్ నుంచి కొలిప్యాక్ వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. అక్కడక్కడ పెద్ద గుంతలు పడడంతో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– రవి, కొలిప్యాక్

నిధులు మంజూరు చేయాలి..

పడకల్ నుంచి వయా మనోహరాబాద్ మీదుగా తొర్లికొండ వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డులో ఎన్నో గుంతలు ఉన్నాయి.రోడ్డుపై కంకర తేలడంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

–రొడ్డ రమేష్, మనోహరాబాద్

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక



సిరికొండ: మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య ఆదివారం తెలిపారు. సౌరశక్తితో నడిచే ట్రాక్టర్‌ను గైడ్ టీచర్స్ జీవన్, సతీష్‌ల సహకారంతో విద్యార్థి రూపొందించగా రాష్ట్రస్థాయికి ఎంపికై ందన్నారు. ఈసందర్భంగా వారిని అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంచ మహేష్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పరామర్శించారు. మహేష్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు ఆసిఫ్, శోభన్, దిగంబర్, రాజేందర్‌గౌడ్, రాములు, జీవన్‌రెడ్డి ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శికి సన్మానం



సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన భూపతి నాయక్ ఇటీవల యూత్ కాంగ్రెస్ రూరల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయనను ఆదివారం మండల కేంద్రంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు బాల్‌రాజ్‌నాయక్, సంతోష్, మాన్‌సింగ్, చందర్ నాయక్,భాస్కర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ధర్పల్లి: మండలంలోని రేకులపల్లిలో ఆదివారం సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు పిట్ల ఎల్లన్న 34వ స్మారక సభ కరపత్రాలను పార్టీ కార్యదర్శి బాలయ్య, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్ మార్క్స్ ఆవిష్కరించారు.

ఈనెల 16న సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఎల్లన్న స్మారక సభను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. నాయకులు గంగాధర్, దాసు, లక్ష్మణ్. రమేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌లాల్‌కు రాష్ట్ర అవార్డు

నిజామాబాద్ రూరల్: నగరానికి చెందిన కవి, ముదక్‌పల్లి ఎస్జీటీ ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్‌కు విశాఖపట్నంలోని మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారి గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డు–2024 ప్రకటించినట్లు ఫౌండర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన విపుల్





నిజామాబాద్ సిటీ: యూత్ కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికై న విపుల్ గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి, సత్కరించారు. వారు విపుల్‌గౌడ్‌ను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం చర్చి కమిటీ సభ్యులు పలువురు కాంగ్రెస్ నాయకులను సన్మానించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, రత్నాకర్, చర్చి కమిటీ సభ్యులు జార్జి ప్రెసిబిటర్, ప్రకాష్, కృపాకర్ తదితరులున్నారు.

నేడు ఆర్మూర్‌లో 2కే రన్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం ఉదయం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించడానికి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2కె రన్‌లో యువకులు పాల్గొన్నాలని వీహెచ్‌పీ సభ్యులు కోరారు.

గొట్టిముక్కలలో వైద్యశిబిరం

మాక్లూర్: మండలంలోని గొట్టిముక్కల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్, మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశా రు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బీరేల్లి విజయ్‌రావు, డాక్టర్ కృష్ణమూర్తి, క్లబ్ సభ్యులు రామకృష్ణ, జుగల్‌సోనీ, రాజేశ్వర్, నర్సింగ్‌రావు, రాజ్‌కుమార్‌సుభేదార్, సతీష్, శ్రీరామ్‌సోనీ, వైద్యులు అరిఫ్‌ంద్, ముఖేష్, రమ్య, ఆఫ్రీన్ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



రెంజల్(బోధన్): వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండల సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించి, యువతకు ఎలాంటి బ్యాంకు పూచీకత్తులు లేకుండా స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయాలన్నారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం బాధకరమన్నారు. బండ క్వారీలు, క్రషర్లపై వడ్డెరలకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వడ్డెర కులస్తుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం స్పందించి నెరవేర్చాలన్నారు. నాయకులు ఎత్తరి సాయిలు, ఆటో శేఖర్, మార్ల అంజి, ముద్దంగులు గిరిలు పేర్కొన్నారు.

ఘనంగా ఆదిమల్లన్న జాతర

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ఆదివారం ఆదిమల్లన్న జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బలిహరణం తర్వాత రథోత్సవం నిర్వహించారు. వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు అలరించాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం మాదిగ జేఏసీ జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జిగా మోతే భూమన్న, జిల్లా అధికార ప్రతినిధిగా మల్లాని శివ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంగరాల రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోయిని జోసఫ్, ఉపాధ్యక్షులుగా దేవయ్య, కనక ప్రకాష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నరేష్ రాములు, పోశెట్టి చిరంజీవి, రాజేష్, ప్రభాకర్, మహిళా విభాగం కన్వీనర్‌గా లతా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ తర్వాత గ్రామ కమిటీలు, మండల కమిటీలను నియోజకవర్గస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

రేపు చలో హైదరాబాద్



నిజామాబాద్ సిటీ: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10 చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ, కంటి వెలుగు కార్యక్రమాల డబ్బులు చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సభ్యులు సుకన్య, రేణుక, బాలమణి, రమ, సంగీత, రేవతి,సాహెరా, రాధాలు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,800	వెండి(కిలో)	95,200
22 క్యారెట్స్	72,705	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	50	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	40
జీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	35	60	ఆలుగడ్డ	35	50
బీర్నీసుకాయ	35	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	30	60	గోబిపువ్వు	50	90
వంకాయ	10	20	బీట్‌రూట్	50	90
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	35	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	25	50
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15, 2.00,6.00,10.00
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-1.00,4.45,9.10
స్క్రీన్-3	పుష్ప-2-11.00,3.10,7.00,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25,10.30
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
స్క్రీన్ -4	పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20
లలితామహల్	కేసీఆర్(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)